# వైద్యంలో వాస్తును చూసే అతని శాస్త్రాన్ని అందరూ నమ్మారా?

# వాస్తువైద్యం

రావ్ దివాకర్ కథ

డాక్టర్ చిదానందం కంగారు పడిపోయాడు. అసలు ఫస్త్రే పడడు. రోజుకో పేషెంట్ ఆపరేషన్ టేబిల్‌పై బకెట్ తన్నేస్తున్నా కూడా నిమ్మకు నీరెత్తినట్లుండేవాడు. అటువంటివాడు చాలా చాలా కంగారు పడిపోయాడు.

కారణం 'వాస్తుశ్రీ'

ఆరోజు కూడా పేషెంట్ ఆపరేషన్ టేబిల్‌పై 'పోతే' తన హాస్పిటల్ వరండాలో కాస్త దీనంగా కూర్చున్నాడు చిదానందం పేషెంట్ బకెట్ తన్నేసినందుకు కాదు, ఫీజు ఎగ్గొట్టి పోయినందుకు. వెధవకి చేతికి ఉంగరం కూడా లేదు.

ఆ సమయాన వచ్చాడు వాస్తుశ్రీ. చిదానందం బావ స్నేహితుడు.

''ఈ విధంగా పేషెంట్స్‌తో లైసులో 'టపా' కట్టేస్తుంటే నీ బిజినెస్ ఎలా సాగుతుందీ'' అన్నాడు జాలిగా – వస్తూనే.

''అదేగందా – నా చింత –'' అనుకోకుండానే అన్నాడు చిదానందం.

''అందుకే నేను మొత్తుకునేది – 'వాస్తు వైద్య విధానం' పాటించరాదూ?''

కంగారుపడిపోయాడు చిదానందం. గుండె దడదడలాడింది. చెమటలు పట్టాయి.

ఆయుర్వేదం – అల్లోపతి – హోమియోపతి – యునానీ – ప్రకృతి వైద్యం గట్రా పేర్లు తను విన్నాడు కానీ – ఈ వాస్తు వైద్య విధానం సడెన్‌గా ఎక్కడ్నుంచి వచ్చింది? ఎమ్.బిబియస్‌లో ఎక్కడా చదివిన గుర్తు లేదు. ఆఖరుకు స్టేట్స్‌లో ఎమ్.ఎస్. చేసినప్పుడు కూడా వినలేదు. చైనా ఆక్యుపంచరయితే వుంది.



సూదులతో పొడవటం సరదాగా వుంటుంది. మరిదెక్కడిది? ఏ దేశానిది? పేరు చూస్తుంటే మన దేశం లాగానే వుంది. అదీ —దక్షిణ భారతదేశ విధానం లాగుంది.

కొంపదీసి దేశానిది కాదుగదా - అయినా అడిగితే... అమ్మో... 'యిజ్జత్ కా సవాల్' అయినా... యీ మధ్య డాక్టర్లకంటే పేషెంట్స్‌కి నాలెడ్జి ఎక్కువయిపోతుంది.

రేపు వాళ్లే మందుల పేర్లు టకటకా చెప్పేస్తారు.

''ఏమి చిదానందం మాట్లాడవు?''

''అబ్బెబ్బె... తడబడ్డాడు. ఆ వైద్యం... నేపెప్పుడు చదవలేదు. ఎన్ని సంవత్సరాల కోర్సు? డిప్లమానా? డిగ్రీనా? నేను చదివిన యూనివర్సిటీలోనైతే లేదు. ఎక్కడుంది?'' టకటకా అడిగేసాడు గుటకలో.

'వాస్తుశ్రీ' వేదాంతిలా నవ్వాడు.

''ఇవన్నీ యూనివర్సిటీలో వుండవు. యూనివర్సిటీల్లో చదివి... మీరిల్లా వున్నారు.''

చిదానందం ఆశ్చర్యపోయాడు.

''అదేమిటీ, చదవకుండానే...''

ఠక్కున అందుకున్నాడు వాస్తుశ్రీ.

''బుర్ర వుంటే చాలు నాయనా. కోటి విద్యలు కూటి కొరకే - చెప్పేది విను. ఆపరేషన్ బల్లమీద పేషెంట్ తల ఎటువైపు పెడతావు?''

చాలా సీరియస్‌గా అడిగాడు.

వేళ్లతో లెక్కలేసి... ''ఉత్తరం వైపు'' అన్నాడు చిదానందం.

''మరింకేం - పేషెంట్ దక్షిణం వైపు చూస్తుంటాడన్నమాట - దక్షిణం 'యమ' స్థానం. పొట్ట కోయగానే - ప్రాణం లాగేస్తాడు.''

''ఏం లాగేస్తాడో - మా ఇంట్లో... అక్కడ ఎత్తుగా వుండాలి - గట్టు కట్టమని వాస్తు పండితుడు పోరెడితే - అతని బాధ భరించలేక గట్టు కట్టించాను. మా ఆవిడ పడి నడుం విరగ్గొట్టుకొని - ఇదే హాస్పిటల్లో రెండు నెలల నుండి పడి వుంది.''

''వాస్తునంతగా తీసేయమాకు. మన్లో మాట నిజం చెప్పు - మీ ఆవిడ గయ్యాళి కదూ?''

మొగమాట పడ్డాడు అవుననటానికి.

''చెప్పు... చిదానందం. రోజూ ఇంటికి వెళ్లగానే రాచి రంపాన పెట్టి - నీకు మనశ్శాంతి లేకుండా చేస్తుందని విన్నాను. ఒకటి రెండుసార్లు నీ బెల్టుతోనే నిన్ను సారీ మనలో మాట...''

సిగ్గుతో తలూపాడు చిదానందం.

''పేషెంట్ తల ఎప్పుడూ దక్షిణం వైపు వుండాలి. బాగా గుర్తు పెట్టుకో. పేషెంట్ బల్ల ఎక్కేటప్పుడు... తూర్పు దిశగా ఎక్కాలి. నీవు పేషెంట్‌కు ఎడం ప్రక్క - తూర్పు వైపు ముఖం పెట్టి ఆపరేషన్ చేయాలి...''

''అదెలా కుదురుతుందీ... యాక్చుయల్లీ...''

''ఇది శాస్త్రం... చెప్పేది విను. పాటించకపోతే ... అడుక్కు తింటావు. అసలు అడుక్కు తింటానికి కూడా ఒక శాస్త్రం వుంది తెల్సా?

'వాస్తు భిక్షాటనము.''

చిదానందానికి ఏడుపు వచ్చింది.

అయినా... అనుకోకుండా... ''అదేమిటి?'' అన్నాడు.

''మీరు యీ శాస్త్రాన్ని నమ్మారు. చాలా తేలికగా తీసేస్తారు. అడుక్కు తినే వాడు కూడా ఈ వాస్తుని పాటించాల్సిందే. లేకపోతే మట్టిగొట్టుకు పోతాడు. సాయిబాబా మందిరం దగ్గర అడుక్కునే వాళ్లని చూసావా?

తూర్పువైపు ముఖం పెట్టి కూర్చుని అడుక్కునేవాడి ఆదాయం చాలా ఎక్కువగా వుంటుంది. అలాగే... అడుక్కునే చిప్ప... తప్పక వృత్తాకారంలో వుండాలి. దాని చుట్టుకొలత – అడుక్కునే వాడి తలకంటే ఎక్కువ వుండకూడదు. అయితే ఇక్కడ చిన్న సవరణ. ప్రక్క కూర్చున్న వాడి చిప్ప పెద్దగా వుంటే... అడుక్కొనే వాడి తల... రెండు వైపుల కూర్చున్న ఇద్దరి తల... మొత్తం మూడు తలల చుట్టుకొలత తీసి – దాన్ని సగం చేస్తే... వచ్చే సంఖ్య... చిప్ప చుట్టుకొలత అవుతుంది. అయితే దీన్ని మొత్తం గుండ్రంగా చేయకూడదు. కోడి గుడ్డు ఆకారంలో చేయాలి. సన్నగా వుండే వైపు పట్టుకొని అడుక్కోవాలి. ఇదీ కథ!''

చిదానందం సగం కోమాలోకి వెళ్లిపోయాడు–

''ఆ మనం ఎక్కడున్నాం? ఆపరేషన్ టేబిల్! కత్తితో కోసేటప్పుడు కోత వాయువ్యం వైపు నుండి ఆగ్నేయం వైపుండాలి...''

బోరుమన్నాడు చిదానందం.


''సార్... కోత... కత్తిపోటు... గ్రటా పదాలు వాడొద్దు సార్... ఎవడైనా ఈ మాటలు వింటే రేపట్నుంచి ఆస్పత్రికి రారు.''

నీవు పారబడ్డావు నాయినా–

మేం ఏం చెబితే అదే వేదం. తెలుగు ప్రజలు... కండకరక్కుండా సంపాదించాలనుకొనే రకం! అందుకే మేం హాయిగా బిజినెస్ చేసికుంటున్నాం. రాష్ట్రంలో ఇంత మంది... ఆర్కిటెక్ట్స్ వున్నారు. ఏం చేస్తున్నారు. కోస్తా జిల్లాల్లో అయితే బొట్టు పెట్టుకొని – వాస్తు పండితులయిపోయారు. ఇక హైదరాబాద్‌లోనైతే – వాళ్లు వేసే డ్రాయింగ్స్ మేం మార్చి అప్రూవ్ చేస్తాం..''

గోడకు తల బాదుకోబోయాడు చిదానందం.

ఏం నాయినా –



తల అలా బాదుకుంటున్నావు? తల పోటా?... టాబ్లెట్ తెప్పిస్తాలే. నీకు తల నెప్పి వచ్చిందంటే ఉదయం... నీవు ఆపరేషన్ చేస్తున్నప్పుడు నర్సు వాయువ్య స్థానంలోకి వచ్చి వుంటుంది.

రాకూడదు!

అదిరిపోయి–ఎగిరి పడ్డాడు చిదానందం.

"ఏం నాయనా - అలాగ ఎగిరి పడ్డావు?"

తల నొప్పి పోయింది - ఇప్పుడేమిటన్నారు?" కంగారుగా అన్నాడు.

"నర్సు వాయువ్య స్థానంలోకి... అంటే నీకు ఎడమ వైపుకి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదు! ఎందుకని అడగకు! అది శాస్త్రం.

నీవు కత్తి కోత వేసేటప్పుడు కత్తి 35.6 డిగ్రీల్లో వుండాలి. డిగ్రీ బాగా గుర్తుపెట్టుకో. ఏమాత్రం డిగ్రీ మారినా తేడా వచ్చేస్తుంది.

"అంటే?"

"నీవు మర్డర్ కేసులో ఇరుక్కుంటావు!"

చేతి రుమాలుతో చమట తుడుచుకున్నాడు చిదానందం.

"సెలైన్ బాటిల్ దక్షిణం వైపుగా వుండాలి. నైరుతి వైపు వుంటే మరీ మంచిది. అలాగే ... నీ అసిస్టెంట్లు - నర్సులు అంతా నీ వెనుక లైనులో వుండాలి. అప్పుడే నీ స్థానబలం!

అంతా వెనుక లైను కడితే... నాకు సహాయం ఎవరు చేస్తారూ?

"వాళ్లే - నీ వెనుక వుండే... సహాయం చేయాలి. నీకు కావల్సిన కత్తులూ - కటార్లు... వెనుక నుండే అందిస్తారు. మరో ముఖ్య విషయం. నీ కత్తులు కటార్లు గ్లూ... మొత్తం కలిపితే... సున్న రాకూడదు. అలా వస్తే ఒక కత్తో కటారో తీసేయి... లేదా... చేర్చు.. అవసరం లేకపోయినా..."

చిదానందం బుర్ర పూర్తిగా పని చేయడం మానేసింది. గుడ్లప్పగించి చూస్తుండిపోయాడు.

"ఇప్పటిదాకా చెప్పింది కొంతే 100 శాతం వాస్తు వైద్య విధానం పాటించాలంటే చాలా వుంది. పేషెంట్ తల దక్షిణం వైపు - ఎడమ పాదం ఈశాన్యం వైపు - కుడిపాదం వాయివ్యం వైపు వుండాలి. కుడిచేయి నైరుతి వైపు - ఎడం చేయి శూన్యం వైపు వుండాలి. ఆ చేతిని కావాలంటే తాడుతో సీలింగుకు కట్టేయవచ్చు. పేషెంట్ కుడిచేతి బొటన వేలు వాయివ్యం వైపు - చూపుడు వేలు నైరుతి వైపు, చిటికెన వేలు ఆగ్నేయం వైపు వుండాలి."

తేరుకున్నాడు చిదానందం. "ఇలా చేస్తే పేషెంట్ ఎముకలు విరిగి నామీద కేసు పెడతాడు."

"ఏం విరగవు! కేరళ నుండి ఆయుర్వేద మసాజ్ చేసే వాళ్లని తెప్పించు.

ఒక్క రోజులో బాడీని స్ప్రింగ్‌లాగా తయారుచేస్తారు".

ఇవన్నీ చేయాలా?

అనుమానంగా అడిగాడు చిదానందం.

"మరి 100 శాతం వాస్తు వైద్య

విధానం పాటించకపోతే దాని ఎఫెక్ట్ వుండదు. ఇప్పటిదాకా పేషెంట్ గురించి చెప్పాను. ఆపరేషన్ చేసేటప్పుడు నీవు కుడికాలు దక్షిణ స్థానంలో వుంచి ఎడం కాలు శూన్యంలోకి...''

బోరున ఏడుస్తూ వాస్తుశ్రీ కాళ్లు పట్టుకున్నాడు చిదానందం. వెక్కి వెక్కి ఏడవసాగాడు.

'వాస్తుశ్రీ' జాలిపడ్డాడు.

''ఊరుకో నాయినా. పశ్చాత్తాపంని మించిన ప్రాయశ్చిత్తం మరింకేది లేదు. ఇప్పటినుంచయినా వాస్తు వైద్య విధానాన్ని పాటించి లక్షలు గడించు''

''పశ్చాత్తాపం కాదు - పిండాకూడు కాదు-'' గొల్లుమన్నాడు చిదానందం.

ఆశ్చర్యపోయాడు వాస్తుశ్రీ. ''మరింకెందుకీ ఏడుపు?''

''ఒకప్పుడు మా డాక్టర్లకు భూత వైద్యుల బాధ వుండేది. వాళ్లనుండి విముక్తి పొందటానికి... దాదాపు వంద సంవత్సరాలు పట్టింది.

మరల ఈ వాస్తు వైద్యులు ఏమిటి నాయనోయ్-'' గొల్లుమన్నాడు.


వాస్తుశ్రీ తాపీగా కిళ్లీ నోట్లో వేసుకున్నాడు.

''సార్... మీరు మా ప్రొఫెషన్ జోలికి రాకుండా వుండటానికి ఎంత తీసుకుంటారు?'' కళ్లు తుడుచుకుంటూ అడిగాడు.

'లంచం ఇస్తున్నావా చిదానందం?'

''లంచం కాదు సార్. జనాన్ని ఎడ్యుకేట్ చేయటానికి ఇంతకాలం పట్టింది. మీరు ఈ లైఫ్‌లో ఈ వాస్తు వైద్యం మొదలుపెడితే ఇక మా మాట ఎవరూ వినరు.

ఈ మధ్య పత్రికల్లో కూడా భూతాల దయ్యాల కథలు ఎక్కువయిపోయాయి. జనానికి వాస్తు పిచ్చి మరీ పట్టింది. జనానికి కాన్ఫిడెన్స్ తగ్గిపోయి ఇలా అయిపోతున్నారు. ఇటువంటి సమయంలో మీరు రెచ్చిపోతే... ఓ మైగాడ్...'' ఫ్యూచర్ తలుచుకొని... భయపడ్డాడు చిదానందం.



## సావాసదోషం

''నిజానికి ఏ తండ్రయినా చెడు సావాసాలు చెయ్యొద్దంటాడు. కాని నువ్వు మంచివాళ్ల సావాసం చెయ్యొద్దంటావేం నాన్నా!''

''నీతో సావాసం చేసి వాళ్లూ చెడిపోకూడదని.'

-పద్మశ్రీ (మాణిక్యారం)

''వస్తాను చిదానందం. లాయరు విశ్వనాధానికి ఎపాయింట్‌మెంట్ ఇచ్చాను. 'వాస్తు వాదానా విధానం' విధానం అని... కోర్టు వాస్తులే... ఆయనకు బోధ చేయాలి.

వాస్తుశ్రీ కాళ్ల గట్టిగా పట్టేసుకున్నాడు చిదానందం.

''సార్... కనీసం... వాళ్లనయినా వదిలేయండి సార్. ఇప్పటికే... ఆ ప్రొఫెషన్‌లో... అసలు న్యాయమే లేదు, సార్...సార్...''

ఏమాత్రం పట్టించుకోకుండా కాళ్లు విడిపించుకొని లాయర్ విశ్వనాథం ఇంటికి బయలుదేరాడు 'వాస్తుశ్రీ'.

''డాక్టర్! శుభవార్త! మీ ఆవిడ లేచి కూర్చుంది'' నర్సు చెప్పుతూ వచ్చింది.

కంగారు పడిపోయాడు చిదానందం.

''ఆపరేషన్ టేబిల్‌మీద ... ఉత్తరం వైపు తల పెట్టి పడుకోబెట్టెయ్'' అన్నాడు–

అని–'అమ్మ వాస్తుశ్రీ'! అనుకున్నాడు. ●

